08-08-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - తండ్రి ఎలాగైతే మార్గదర్శకులో, అలాగే మీరు కూడా మార్గదర్శకులుగా అయి అందరికీ ఇంటి మార్గాన్ని చూపించాలి, గుడ్డివారికి ఊతకర్రగా అవ్వాలి. "**

**ప్రశ్న:-** ఈ తయారు చేయబడిన అనాది డ్రామాలోని ఏ రహస్యం పిల్లలైన మీకు మాత్రమే తెలుసు?

**జవాబు:-** ఇది తయారు చేయబడిన అనాది డ్రామా. ఇందులో ఏ పాత్రధారిని కొత్తగా చేర్చేందుకు గాని, తీసేందుకు గాని సాధ్యం లేదు. మోక్షము ఎవ్వరికీ లభించదు. ఈ రాకపోకల చక్రములో మేము రానే రాకూడదు అని ఎవరికైనా అంటే - కొద్ది సమయం వరకు మాత్రమే అది సాధ్యము. కాని పాత్ర నుండి పూర్తిగా ఎవ్వరూ విడుదల అవ్వలేరు. ఈ డ్రామా రహస్యం పిల్లలైన మీకు మాత్రమే తెలుసునని బాబా చెప్తారు.

**ఓంశాంతి.** భోలానాథుడని ఎవరిని అంటారో మధురాతి మధురమైన పిల్లలకు తెలుసు. సంగమయుగ పిల్లలైన మీరు మాత్రమే అర్థం చేసుకోగలరు. కలియుగ మనుష్యులకు కొంచెము కూడా తెలియదు. జ్ఞానసాగరులు ఒక్క తండ్రి మాత్రమే. వారే సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని అర్థము చేయిస్తారు. తమ పరిచయాన్నిస్తారు. పిల్లలైన మీరిప్పుడే ఆ జ్ఞానము తెలుసుకున్నారు. ఇంతకు ముందు ఏమీ తెలిసేది కాదు. తండ్రి చెప్తున్నారు - నేనే వచ్చి భారతదేశాన్ని స్వర్గంగా చేస్తాను. అనంతమైన వారసత్వమునిస్తాను. దానిని మీరిప్పుడు తీసుకుంటున్నారు. మనము అనంతమైన తండ్రి ద్వారా అనంతమైన సుఖ వారసత్వాన్ని తీసుకుంటున్నామని మీకు తెలుసు. ఇది తయారు చేసి చేయబడిన డ్రామా. ఒక్క పాత్రధారి కూడా ఎక్కువా కారు, తక్కువా కారు. అందరికీ తమ తమ పాత్ర లభించింది. ఎవ్వరూ మోక్షమును పొందలేరు. ఎవరు ఏ ధర్మానికి చెందినవారో వారు ఆ ధర్మములోకి వెళ్తారు. బౌద్ధులు, క్రైస్తవులు, స్వర్గములోకి వెళ్ళాలనుకున్నా వెళ్ళలేరు. వారి ధర్మస్థాపకులు వచ్చినప్పుడే వారి పాత్ర ఉంటుంది. ఇది పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. ప్రపంచములోని మనుష్యులంతా ఈ సమయంలో నాస్తికులుగా ఉన్నారు. అంటే వారికి అనంతమైన తండ్రి గురించి తెలియదు. మనుష్యులే తెలుసుకుంటారు కదా. ఇది మనుష్యులు నటించే నాటకశాల. ప్రతి ఆత్మ నిర్వాణధామము నుండి పాత్రను అభినయించేందుకు వస్తుంది. వచ్చిన తర్వాత మళ్ళీ నిర్వాణధామానికి వెళ్ళేందుకు పురుషార్థము చేస్తుంది. బుద్ధుడు నిర్వాణములోకి వెళ్ళారని అంటారు అంటే బుద్ధుని శరీరమంటూ వెళ్ళజాలదు. ఆత్మ వెళ్తుంది. కాని ఏ ఆత్మా వెళ్ళలేదని బాబా అర్థము చేయిస్తున్నారు. నాటకము నుండి బయట పడలేరు. మోక్షము పొందలేరు. ఇది తయారు చేసి చేయబడిన డ్రామా కదా. కొందరు మనుష్యులు మోక్షము లభిస్తుందని, దాని కొరకు పురుషార్థము చేస్తూ ఉంటారు. జైనులు మోక్షము కొరకు పురుషార్థము చేస్తూ ఉంటారు. వారికి తమవే అయిన ఆచార సంప్రదాయాలు ఉన్నాయి. వారికి తమవారే అయిన గురువు ఉన్నారు. వారందరూ ఆ గురువునే నమ్ముతారు. కాని మోక్షము ఎవ్వరికీ లభించదు. మనము ఈ డ్రామాలో పాత్రధారులమని మీకు తెలుసు. మనము ఎప్పుడు వచ్చామో ఎలా వెళ్తామో - ఇది ఎవ్వరికీ తెలియదు. జంతువులకైతే తెలియదు కదా. మేము పాత్రధారులమని మనుష్యులే చెప్తారు. ఇది కర్మక్షేత్రము. ఇక్కడ ఆత్మలు కర్మలు చేస్తాయి. ఆత్మలున్న చోటును కర్మక్షేత్రమని అనరు. అది నిరాకార ప్రపంచము. అక్కడ ఏ ఆటపాటలూ ఉండవు. ఏ కర్మా

ఉండదు. నిరాకార ప్రపంచము నుండి సాకార ప్రపంచములోకి పాత్రను అభినయించేందుకు వస్తారు. ఆ పాత్ర పునరావృతమౌతూనే ఉంటుంది. ప్రళయము ఎప్పుడూ జరగదు. మహాభారత యుద్ధంలో యాదవులు, కౌరవులు మరణించారని కేవలం పంచ పాండవులే మిగిలారని వారు కూడా పర్వతాల పై కరిగిపోయారని ఇంకేమీ మిగలలేదని శాస్త్రాలలో వ్రాసేశారు. అందువలన ప్రళయము జరిగిందని భావిస్తారు. ఈ కథలన్నీ వారు కూర్చొని తయారు చేశారు. తర్వాత సముద్రములో రావి ఆకు పై ఒక బాలుడు నోట్లో బొటన వ్రేలు చీకుతూ వచ్చినట్లు చూపిస్తారు. అయితే అతని నుండి ప్రపంచము ఎలా జన్మిస్తుంది. మనుష్యులు ఏది విన్నా అది సత్యమేనని అంటారు. ఇవన్నీ భక్తిమార్గములోని శాస్త్రాలు. భక్తులకు ఫలమునిచ్చేవాడు భగవంతుడు ఒక్కడేనని ఇప్పుడు పిల్లలైన మీరు తెలుసుకున్నారు. కొందరు ముక్తికి, కొందరు జీవన్ముక్తికి వెళ్ళిపోతారు. ప్రతి పాత్రధారి ఆత్మ, తన పాత్ర వచ్చినప్పుడు మళ్లీ కిందికి వస్తుంది. ఈ డ్రామా రహస్యం పిల్లలైన మీకు తప్ప మరెవ్వరికీ తెలియదు. మాకు రచయిత, రచనల గురించి తెలియదని అంటారు. డ్రామాలో పాత్రధారులై ఉండి దాని ఆదిమధ్యాంతాల గురించి, దాని గడువు గురించి తెలియదనడం బుద్ధిహీనతే కదా. అర్థము చేయించినా అర్థము చేసుకోరు. 84 లక్షలని అనుకున్న కారణంగా గడువును లక్షల సంవత్సరాలకు పెంచేశారు.

బాబా ద్వారా కల్ప-కల్పము వచ్చి స్వర్గచక్రవర్తి పదవిని తీసుకుంటామని పిల్లలైన మీరు అర్థము చేసుకున్నారు. 5 వేల సంవత్సరాల క్రితము కూడా బేహద్ వారసత్వాన్ని తీసుకునేందుకు మేము మీతో కలిశాము. యథా రాజా-రాణి తథా ప్రజా అందరూ విశ్వాధికారులుగా అవుతారు. మేము విశ్వానికి అధికారులమని ప్రజలు కూడా అంటారు. మీరు విశ్వానికి అధికారులుగా అయినప్పుడు చంద్రవంశీ రాజ్యముండదు. పిల్లలైన మీరు డ్రామా ఆదిమధ్యాంతాలను తెలుసుకున్నారు. మనుష్యులు భక్తిమార్గములో ఎవరిని పూజిస్తారో వారిని గురించే తెలియదు. ఎవరి భక్తిని చేయవలసి ఉంటుందో వారి చరిత్రను కూడా తెలుసుకోవలసి ఉంటుంది కదా. పిల్లలైన మీరిప్పుడు అందరి చరిత్రను తండ్రి ద్వారా తెలుసుకున్నారు. మీరు తండ్రి వారిగా అయ్యారు. తండ్రి జీవన కథను గురించి తెలుసు. ఆ తండ్రి పతిత పావనులు, ముక్తిదాత, మార్గదర్శకులు. మిమ్ములను పాండవులని అంటారు. మీరు అందరికీ మార్గదర్శకులుగా అవుతారు. అంధులకు ఊతకర్రగా అయి అందరికీ మార్గము చూపిస్తారు. తండ్రి వలె పిల్లలు కూడా మార్గదర్శకులుగా అవ్వాలి. అందరికీ మార్గాన్ని తెలియజేయాలి. మీరు ఆత్మలు, వారు పరమాత్మ. వారి నుండి అనంతమైన వారసత్వాన్ని పొందుకోవాలి. భారతదేశంలో అనంతమైన రాజ్యముండేది, ఇప్పుడది లేదు. మనము అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖ వారసత్వాన్ని తీసుకుంటున్నాము అనగా మనుష్యుల నుండి దేవతలుగా అవుతున్నాము. మనమే దేవతలుగా ఉండేవారము, 84 జన్మలు తీసుకొని శూద్రులుగా అయ్యాము. తండ్రి వచ్చి శూద్రుల నుండి బ్రాహ్మణులుగా చేస్తున్నారు. యజ్ఞములో బ్రాహ్మణులు తప్పకుండా కావాలి. ఇది జ్ఞాన యజ్ఞము. భారతదేశములో యజ్ఞాలు చాలా రచిస్తారు. అందులో ముఖ్యంగా ఆర్యసమాజము వారు చాలా యజ్ఞాలు రచిస్తారు. ఇప్పుడిది రుద్రజ్ఞాన యజ్ఞము. ఇందులో పాత ప్రపంచము పూర్తిగా సమాప్తమైపోతుంది. ఏ వస్తువూ పనికి రాదు. సత్యయుగములో అన్నీ నూతనమైనవే ఉంటాయి. ఇక్కడ ఎంత మురికి ఉంది! మనుష్యులు ఎంత మురికిగా ఉంటారు! ధనవంతులు చాలా మంచి మహళ్లలో ఉంటారు. పేదవారు పాపం ఎంతో మురికిలో, గుడిసెలలో పడి ఉంటారు. ఇప్పుడు ఈ గుడిసెలను పడదోసి మరో స్థానము ఇచ్చి ఆ భూమిని అమ్మేస్తూ ఉంటారు. ఖాళీ చేయలేదంటే

బలవంతంగా ఖాళీ చేయిస్తారు. పేదలు చాలా దు:ఖీలుగా ఉన్నారు. ఎవరైతే సుఖంగా ఉన్నారో వారికి కూడా స్థిరమైన సుఖము లేదు. ఒకవేళ స్థిరమైన సుఖముంటే అది కాకిరెట్టకు సమానమైన సుఖమని ఎందుకు అంటారు.

శివభగవానువాచ, నేను ఈ మాతల ద్వారా స్వర్గ ద్వారాలు తెరుస్తున్నాను. మాతల పై కళశము పెట్టాను. వారు అందరికీ జ్ఞానామృతాన్ని తాపిస్తారు. కాని మీది ప్రవృత్తి మార్గము. మీరు సత్య-సత్యమైన బ్రాహ్మణులు, అందరినీ జ్ఞానచితి పై కూర్చోబెడ్తున్నారు. ఇప్పుడు మీరు దైవీ సంప్రదాయస్థులుగా అవుతున్నారు. ఆసురీ సంప్రదాయమంటే రావణ రాజ్యము. గాంధీజీ కూడా రామరాజ్యము కావాలని కోరుకునేవారు. ఓ పతితపావనా! రండి అని పిలుస్తారు, కానీ స్వయాన్ని పతితులమని భావించరు. తండ్రి పిల్లలను మేల్కొల్పుతున్నారు. మీరు గాడాంధకారము నుండి వెలుగులోకి వచ్చేశారు. గంగా స్నానము చేస్తే పావనమౌతామని మనుష్యులు భావిస్తారు. అలాగే గంగలో పూర్తి హరిద్వారములోని మురికి వచ్చి చేరుతుంది. తర్వాత ఆ మురికినే పొలాలకు తీసుకెళ్తారు. సత్యయుగంలో ఇలాంటి పనులు జరగవు. అక్కడ లెక్కలేనంత ధాన్యముంటుంది. ధనము ఖర్చు చేయవలసిన అవసరముండదు. బాబా అనుభవీ కదా. మొదట ధాన్యము ఎంత చౌకగా లభించేది. సత్యయుగంలో చాలా కొద్దిమంది మనుష్యులే ఉంటారు. కనుక ప్రతి వస్తువు చౌకగా ఉంటుంది. అందుకే తండ్రి చెప్తారు - మధురమైన పిల్లలారా! ఇప్పుడు మీరు పతితము నుండి పావనంగా అవ్వాలి. అందుకు చాలా సహజమైన యుక్తిని తెలియజేస్తారు. స్వయాన్ని మీరు ఆత్మ అని భావించి తండ్రిని స్మృతి చేయండి. ఆత్మలోనే మలినము చేరడం వలన పూర్తి అపవిత్రమైపోతుంది. ఎవరు పూర్తి పారసబుద్ధిగా ఉండేవారో వారే ఇప్పుడు రాతి బుద్ధిగా అయ్యారు. పిల్లలైన మీరిప్పుడు రాతినాథుల నుండి పారసనాథులుగా అయ్యేందుకు తండ్రి వద్దకు వచ్చారు. అనంతమైన తండ్రి మిమ్ములను విశ్వానికి యజమానులుగా చేస్తారు. అది కూడా స్వర్ణిమయుగ విశ్వానికి అధికారులుగా చేస్తారు. ఇది ఇనుపయుగ విశ్వము. తండ్రి కూర్చొని పిల్లలను పారసపురానికి యజమానులుగా చేస్తారు. ఇక్కడి ఇన్ని మహళ్ళు, అంతస్తులు మొదలైనవేవీ పనికి రావని మీకు తెలుసు. అన్నీ సమాప్తమైపోతాయి. మరి అసలు ఇక్కడేముంది! అమెరికా వద్ద ఎంత బంగారు ఉంది! ఇక్కడ మాతల వద్ద ఉన్న కొద్ది బంగారాన్ని కూడా తీసుకుంటూ ఉంటారు ఎందుకంటే అప్పును బంగారు రూపంలో తీర్చవలసి ఉంటుంది. మీ వద్ద అక్కడ బంగారమే బంగారముంటుంది. ఇక్కడ గవ్వలు, అక్కడ వజ్రాలు ఉంటాయి. దీనిని ఇనుప యుగమని అంటారు. భారతదేశమే అవినాశీ ఖండము. ఎప్పుడూ నాశనమవ్వదు. భారతదేశమే సర్వ శ్రేష్ఠమైనది. మాతలైన మీరు పూర్తి విశ్వాన్ని ఉద్ధరిస్తారు. మీ కొరకు తప్పకుండా నూతన ప్రపంచము కావాలి, పాత ప్రపంచము వినాశనమవ్వాలి. ఇవి ఎంత తెలుసుకోవలసిన విషయాలు. శరీర నిర్వహణార్థము వ్యాపారాలు మొదలైనవి కూడా చేయాలి. ఏమీ వదలరాదు. బాబా చెప్తున్నారు - అన్ని పనులు చేస్తూ కూడా నన్ను స్మృతి చేస్తూ ఉండండి. భక్తిమార్గములో కూడా మీరు ప్రియుడైన నన్ను - *'మీరు వచ్చి మమ్ములను వికారుల నుండి పవిత్రంగా తయారు చేయండి.'* అని స్మృతి చేస్తూ వచ్చారు. వారిని ప్రయాణికుడు అని కూడా అంటారు. మీరందరూ ప్రయాణికులే కదా. అది మీ ఇల్లు, అక్కడ ఆత్మలన్నీ ఉంటాయి.

మీరు అందరినీ జ్ఞానచితి పై కూర్చోబెడ్తారు. అన్ని లెక్కాచారాలను సమాప్తము చేసుకొని

వెళ్తారు. మళ్ళీ కొత్తగా మీరు వస్తారు. ఎంతెంత స్మృతిలో ఉంటారో అంత పవిత్రంగా అవుతారు. అంతేకాక అంత శ్రేష్ఠమైన పదవిని కూడా పొందుతారు. మాతలకైతే తీరిక ఉంటుంది. పురుషుల బుద్ధి వ్యాపార వ్యవహారాల వైపే పరిగెడుతూ ఉంటుంది. అందుకే తండ్రి జ్ఞాన కళశాన్ని మాతల పై ఉంచారు. ఇక్కడ స్త్రీకి - *'నీ పతియే నీకు ఈశ్వరుడు, గురువు సర్వస్వము. నీవు వారి దాసివి'* అని చెప్తారు. ఇప్పుడు మాతలైన మిమ్ములను మళ్ళీ ఎంత ఉన్నతంగా చేస్తున్నారు. నారీమణులైన మీరే భారతదేశాన్ని ఉద్ధరిస్తారు. ఈ ప్రపంచములోకి రాకపోకల నుండి విడుదల అవ్వవచ్చునా? అని కొంతమంది బాబాను అడుగుతారు. అవును, కానీ కొంత సమయము వరకు మాత్రమే. పిల్లలైన మీరు ఆల్‌రౌండర్లు. ఆది నుండి అంత్యము వరకు పాత్రను అభినయిస్తారు. మిగిలినవారు ముక్తిధామములో ఉంటారు. వారి పాత్ర కొద్ది సమయము మాత్రమే ఉంటుంది. వారు స్వర్గములోకి వెళ్ళేవారు కాదు. రాకపోకల నుండి ముక్తి అని చివర్లో వచ్చి వెళ్ళిపోయేవారికి చెప్పవచ్చు. వారు జ్ఞానము మొదలైనవి వినలేరు. ప్రారంభము నుండి అంత్యము వరకు పాత్రను అభినయించినవారు మాత్రమే వింటారు. మాకిదే ఇష్టమని కొందరంటారు. మేమక్కడే కూర్చుని ఉంటాము. కాని అలా జరగదు. డ్రామాలో నిర్ణయమై ఉంది. వెళ్ళి మళ్ళీ చివర్లో తప్పకుండా వస్తారు. మిగిలిన సమయమంతా శాంతిధామములో ఉంటారు. ఇది అనంతమైన డ్రామా. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. సత్య-సత్యమైన బ్రాహ్మణులుగా అయి అందరికి జ్ఞానామృతాన్ని త్రాగించాలి. జ్ఞాన చితి పై కూర్చోబెట్టాలి.
2. శరీర నిర్వహణ కొరకు వ్యాపారాలు మొదలైనవన్నీ చేస్తూ పతితుల నుండి పావనంగా అయ్యేందుకు తండ్రి స్మృతిలో ఉండాలి, అందరికీ తండ్రి స్మృతిని ఇప్పించాలి.

## వరదానము :- " నిరంతర స్మృతి మరియు సేవల బ్యాలెన్స్ ద్వారా పిల్ల చేష్టలను సమాప్తం చేసే వానప్రస్థీ భవ "

చిన్న చిన్న విషయాలలో అమూల్యమైన సంగమ సమయాన్ని పోగొట్టుకోవడం పిల్ల చేష్టలు లేక వయ్యారాలు. ఇప్పుడీ వయ్యారాలు శోభించవు. వానప్రస్థంలో కేవలం ఒకే కార్యముంటుంది - తండ్రి స్మృతి మరియు సేవ. ఈ రెండు తప్ప ఇంకెవ్వరూ గుర్తు రాకూడదు. లేచినా, నిదురించినా సదా స్మృతి మరియు సేవ - నిరంతరం ఈ బ్యాలెన్స్ ఉండాలి. త్రికాలదర్శులుగా అయి బాల్యములోని విషయాలను లేక పిల్లల సంస్కారాలను సమాప్తి సమారోహం చెయ్యండి, అప్పుడు వానప్రస్థులని అంటారు.

## స్లోగన్ :- " సర్వ ప్రాప్తులతో సంపన్న ఆత్మల గుర్తు – సంతుష్టత(తృప్తి). తృప్తిగా ఉండండి, తృప్తి పరచండి "